క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఎంపీపటేల్‌గూడలో కంఠమహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం కంఠమహేశ్వర స్వామి, సూరమాంబ సమేత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వేధ పండితుల మంత్రోచ్ఛరణలతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గౌడసంఘం పెద్దలు డొంకని ఆంజనేయులుగౌడ్, ఎరుకలి శ్రీనివాస్‌గౌడ్, వర్కాల వెంకటేష్‌గౌడ్, పాతూరి శ్రీనివాస్‌గౌడ్, డొంకని ఈశ్వర్‌గౌడ్ గ్రామపెద్దలు పూజలో పాల్గొన్నారు.

ఆడ బిడ్డ వివాహానికి చేయూత



నగదు అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: పేదింటి ఆడ బిడ్డ వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. మండల పరిధిలోని కానుగుబావితండాలో నేనావాత్ సుగుణ, భీమా దంపతుల కూమార్తె మాన్విక వివాహం శుక్రవారం జరిగింది. ఈ మేరకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ వివాహానికి రూ.21 వేల ఆర్థికసాయంతో పాటు, పెళ్లి కూతురుకు పట్టు చీరను సైతం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, హరిచంద్, శ్వేత, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, శారద, పాండు, భీమన్, లక్ష్మణ్, రమేశ్, శ్రీను, రాజేశ్, బిక్కు, జగన్ తదితరులు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు: మండలంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని డీఎంకే ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు

కమిషనర్ సత్యనారాయణరెడ్డి



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వరుసగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం 15వ వార్డులోని జెఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 30 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాలనీవాసులతో మాట్లాడుతూ.. చెత్తను ఆరుబయట వేయవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. దోమల నివారణ ఫాగింగ్ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన లెంకపోతుల ప్రణీత్‌గౌడ్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకును సాధించాడు. దీంతో గ్రామస్తులు శుక్రవారం విద్యార్థిని అతని ఇంటివద్ద శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, మధునాల శివనాండ్, విసన్నగారి రవీందర్, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్
- మంచాలలో ఎన్నికల ప్రచారం



మంచాల: ప్రచారంలో పాల్గొన్న నర్సయ్యగౌడ్

మంచాల: దేశంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని లోయపల్లి, ఆంబోత్ తండా, సత్తి తండా, బోడకొండ, ఎల్లమ్మ తండా, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాడన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం మొదలుకొని శ్మశాన వాటికలు, క్రీడా మైదానాలు, నర్సరీలు, మొక్కలు నాటడం కూడా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో చేస్తున్న కార్యక్రమాలు అన్నారు. అర్హులందరికీ రేషన్ బియ్యం సరఫరా చేసి ఆదుకుంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చిందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లుగా పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కీంల కంటే ఎక్కువ స్కాంలు చేసిందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను దివాలా తీర్చారన్నారు. నేడు మరలా మాకు ఓటు వేయండి అంటూ ప్రజల ముందుకు వస్తున్నారని ఆరోపించారు. ప్రజాపాలనను గాలికి వదిలేసి మన ఓట్లు వేసుకొని రూ.కోట్లు దండుకునే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ఓడించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య, మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, నాయకులు జయశ్రీ,రాజేశ్వరి, నర్సింహారెడ్డి, కొండలు, రాజు, రాజేందర్‌రెడ్డి, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే అత్యధిక సీట్లు

తలకొండపల్లి: రాష్ట్రంలో బీజేపీకి 12 ఎంపీ సీట్లు రావడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి నీలకంఠం పాండు ధీమా వ్యక్తం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రబాయి పటేల్‌ను పాండు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భరత్ ప్రసాద్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ముఖ్యమంత్రి భూపేంద్ర సూచించారు. అనంతరం పాండు మాట్లాడుతూ.. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలని ప్రజలకు సూచించారు. ప్రజల దృష్టి ప్రధాని నరేంద్ర మోదీపైన ఉందని, దేశంలో బీజేపీ అత్యధిక సీట్లు కై వసం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: ముఖ్యమంత్రిని కలిసిన పాండు

దళారులను నమ్మి మోసపోవద్దు

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఆమె కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి చెత్త, మట్టిపెళ్లలు లేకుండా తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని వివరించారు. వరిధాన్యాన్ని ఎండబెట్టి 17 శాతం తేమ ఉండేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి పద్మాకర్‌రెడ్డి, రైతులు రామస్వామి, పద్మానాయక్, యాదయ్య, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావు

జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్



ఉదయ్‌కిరణ్ తండ్రిని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన ఆత్మహత్యలు పరిష్కారం కావని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన సోమరాజు పాండు, పుష్ప దంపతులు కొన్నేళ్లుగా తమ పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ చదివిస్తున్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో పాండు కుమారుడు ఉదయ్‌కిరణ్(17) ఇంటర్ ఫస్టియర్‌లో ఒక్క సబ్జెక్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని స్వగ్రామం రావిచేడ్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ గ్రామానికి చేరుకుని ఉదయ్‌కిరణ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత దంపతులకు ఉన్న ఒక్క కుమారుడు ఇలా ఆత్మహత్య చేసుకోవడం పట్ల గ్రామస్తులు కన్నీటి పర్యాంతమయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ భారతమ్మ, నాయకులు రమేశ్, లింగం తదతరులు ఉన్నారు.

కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి



ఆరుట్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగుర వేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందాలని స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, నాయకులు రాములు, పాండు, యాదయ్య, హన్మంత్‌రెడ్డి, సలాం, చంద్రయ్య, బాషా, రమేశ్, రాజుగౌడ్, సురేష్, వెంకటరమణారెడ్డి, కృష్ణ, మాసయ్యగౌడ్, ఐలయ్య, శ్రీకాంత్, గిరి, అశోక్, పరమేష్, పెంటయ్య, నర్సింహ పాల్గొన్నారు.

భువనగిరిలో పది నామినేషన్ల తిరస్కరణ

- ముగిసిన పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ

సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. భువనగిరి లోకసభ స్థానానికి మొత్తం 61 మంది నామినేషన్లు వేశారు. అధికారులు స్క్రూటినీ చేసి సరిగా లేని 10 మంది నామినేషన్లను తిరస్కరించారు. ఎన్నికల పరిశీలకుడు క్షేత్రి మయూమ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగేల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేశారు. తప్పులున్న నామినేషన్ల జాబితాను సిద్ధం చేసిన తర్వాత మరోసారి రాష్ట్ర ఎన్నికల సంఘంతో అధికారులు చర్చించారు. సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ సందేహాలను నివృత్తి చేసుకున్న అనంతరం సరిగాలేని నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.



నమినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

పలువురు అభ్యర్థుల అఫిడవిట్‌లలో తప్పులు

పలువురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో తప్పులు దొర్లడంతో వారికి ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. సరిచేసి మరోమారు అఫిడవిట్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత అందజేసిన అఫిడవిట్‌లో కూడా తప్పులు చోటు చేసుకోవడంతో వారి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. మరికొందరు అభ్యర్థులు తమ ప్రతిపాదితుల జాబితాలోని సీరియల్ నంబర్లు తప్పుగా నమోదు చేయడంతో వారి నామినేషన్లు తిరస్కరించారు. అలాగే చివరి రోజు ఇద్దరు అభ్యర్థులు డిపాజిట్ డబ్బులు చెల్లించకుండానే నామినేషన్ పత్రాలు సమర్పించారు. దీంతో వారిద్దరిని తిరస్కరించారు.

బూర నర్సయ్య పేరుతో నామినేషన్

బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పేరు ఉన్న మరో వ్యక్తి నామినేషన్ వేశారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బూర నర్సయ్య గురువారం చివరి నిమిషంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే అభ్యర్థిని ప్రతిపాదించిన పది మంది పేర్లు ఉన్నప్పటికీ అందరి సంతకాలు లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. జాతీయ పార్టీ అభ్యర్థి పేరున అదే పేరుతో మరో వ్యక్తి నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ



మాట్లాడుతున్న బలరామకృష్ణ

మాడ్గుల: మానవ అక్రమ రవాణా నిర్మూలించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, కోఆర్డినేటర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మహిళ శిశు సంక్షేమ శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సూపర్ వైజర్‌లు జయమ్మ, పద్మలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. నేటి సమాజం కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ వాడుతున్న వారు ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా యువతులు మొబైల్ ఫోన్‌లో రకరకాల యాప్స్ ద్వారా లైంగిక వ్యాపారానికి గురి అవుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్వల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

జహంగీర్‌బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గా వద్ద ప్రార్థన చేస్తున్న ఎంపీటీసీ మంగమ్మ తదితరులు

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పరిధిలోని గౌరారంలో ఉన్న జహంగీర్ బాబా దర్గాలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద చాదర్ సమర్పించి ఫాతేహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగమ్మ, మాజీ వైస్ ఎంపీపీ నిట్టినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు కార్ఖానాకు.. కేసీఆర్ దవాఖానాకు

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్రంలో కారు కార్ఖానాకు, కేసీఆర్ దవాఖానాకు పోయారని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజగోపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, ఈసీ శేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు: అసమర్థ బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కులేదని జిల్లా గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో రూ.1 లక్ష వరకు రుణమాఫీ హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 వరకు ఆ హామీని అమలు చేయడంలో విఫలమయిందన్నారు. ఆ పార్టీ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై మోపి, రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధి పొందేలా ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించేలా బీఆర్‌ఎస్ నాయకులు వెకిలి చేష్టలు చేస్తున్నారని, అందులో భాగంగానే హరీశ్‌రావు రాజీనామా అంటూ కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. రైతులు ప్రతిపక్షాల మోసపూరిత మాటలను పట్టించుకోవద్దని, కాంగ్రెస్ అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా అండగా నిలవాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

- పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి
- వెంకటాపూర్‌లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న కేశవరెడ్డి తదితరులు

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో యజ్ఞహోమాలు, అభిషేకం, కంకణధారణం, మంటపారాధనలు కిషన్ ప్రభు ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించి వేద ఆశీర్వదాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్‌రెడ్డి, ఎంపీటీసీలు అంబాజీ, గౌతిరెడ్డి సునీత, రాఘవేందర్‌రెడ్డి, వేద పండితులు నర్సింహయ్య, కామేశ్వరమూర్తి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, అడ్వొకేట్ శ్రీనివాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ సిగ్నల్!

- ప్రమాదాలకు నిలయంగా ప్రశాంతిహిల్స్ కూడలి
- వేగాన్ని కంట్రోల్ చేయలేక తరచూ సంఘటనలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



స్పీడ్ బ్రేకర్లు లేక అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

మీర్‌పేట: ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరించారు. రాకపోకలకు మార్గం సులువైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ప్రధాన కూడళ్లలో మాత్రం వాహనాల వేగానికి కళ్లెం వేసే చర్యలు తీసుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మీర్‌పేట నుంచి అల్మాస్‌గూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రశాంతిహిల్స్ కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. అటు మీర్‌పేట నుంచి ఇటు నందిహిల్స్ నుంచి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతూ పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. ప్రస్తుతం కూడలికి ఇరువైపులా రోడ్డు పెద్దగా ఉండడం, వేగాన్ని తగ్గించేందుకు కనీసం అధికారులు స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు.

రాకపోకలు ఎక్కువ

ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు వైపులా నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడం , దీంతో పాటు నందిహిల్స్ నుంచి రహదారి దిగువన ఉండడంతో వాహనదారులు కూడలికి రాగానే వేగాన్ని కంట్రోల్ చేయలేకపోతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే రహదారిలో ప్రతి సోమవారం వారాంతపు సంత కూడా నిర్వహిస్తారని, ఏదైనా పెద్ద వాహనం అదుపు తప్పితే పెద్ద ప్రమాదమే జరుగుతుందని, కావున కార్పొరేషన్ అధికారులు స్పందించి కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేదా రబ్బరు బారికేడ్లు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



రహదారిని విస్తరించిన నాటి నుంచి ప్రశాంతి హిల్స్ కూడలిలో రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పాటు రాత్రి వేళల్లో హైమాస్ట్ లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదు.

– దాసరి బాబు, ప్రశాంతిహిల్స్